శైవవాణి



శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘము

మాచవరం డౌన్ -విజయవాడ

నవంబర్ - 2001

అభినందనలు

కర్నూలుజిల్లా అర్చకసంఘ కార్యదర్శిగా శ్రీ కంఠంనందీశ్వర్‌గారు అర్చకసమస్యల విషయంలో చేస్తున్నకృషికి మా కృతజ్ఞతాభివందనాలు.

1. T. శేషయ్య - సాంబశివయ్య, వేణుగోపాలయ్య - పరమేశ్వరశర్మ - నర్నూరు. మదియముల శ్రీనివాసులు గార్లు అభినందనలు తెలిపారు.

దక్షిణదేశయాత్ర

పశ్చిమగోదావరి జిల్లా బల్లిపాడు వాస్తవ్యులు శ్రీ వెలవలపల్లి చినసాంబమూర్తిగారి ధర్మపత్ని శ్రీమతి వెంకటరమణమ్మ అత్తిలివాస్తవ్యులు విల్లూరి రామంగారి భార్య సుభద్రమ్మగార్లు 18-9-2001న బయలుదేరి 33 క్షేత్రాలుదర్శించి సేతురామేశ్వరం వగైరా దర్శించి క్షేమంగా తిరిగివచ్చి సమారాధన జరుపుకున్నారు. యీ సందర్భంగా శైవవాణికి రు 25లు.

బారసాల

విశాఖపట్నం జిల్లా మాడగుల వాస్తవ్యులు పుల్లేటికుర్తి శ్రీనివాసశర్మ, శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతుల ఏకైకపుత్రునికి 4-10-2001 గురువారం స్థానిక మోదకొండమ్మ ఆలయంలో బారసాల జరిపి చిరంజీవి "మోహనవెంకట సుబ్బారావు మధు" అని నామకరణం చేసిన సందర్భమున శ్రీకంఠగురు తాంబూలము రు 20లు శైవవాణికి రు 30లు సమర్పించారు.

కాశీయాత్ర

చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి వాస్తవ్యులు మదనూరు వెంకటరమణశర్మ, శ్రీమతి అనూరాధమ్మ దంపతులు యిటీవల కాశీ త్రివేణీ సంగమం, అయోధ్య రామ జన్మభూమి దర్శనం గంగా ప్రయాగలలో మాతృపితృతర్పణాలు సంతృప్తిగా జరుపుకుని పుణ్యక్షేత్రాలు సందర్శించి వచ్చిన సందర్భంగా శ్రీకంఠగురుపీఠమునకు రు 50లు శైవవాణికి రు 50లు వీరి అన్నగారైన మదనూరు వెంకట సుబ్బయ్యశర్మగారి ఆశీస్సులతో సమర్పించారు.

వధువుకావలెను

1. కొండవీటి మురళీకృష్ణ M.Sc. B.Ed
   గోత్రం - మహర్షి - వయస్సు 28. ఎత్తు 5' - 4" వృత్తి : స్వంత కాన్వెంట్ - మందపాడు - గుంటూరుజిల్లా వధువు డిగ్రీచదివి, ఎరుపురంగు కలిగిఉండాలి.
2. కొండవీటి శ్రీనివాసరావు - S/o సాంబశివరావు
   వయస్సు 28 ఎత్తు 5'-3" వృత్తి అర్చకత్వం 7th క్లాస్ వరకు ఉండాలి.

సంప్రదించవలసిన చిరునామా పై రెండింటికి కొండవీటిరాజేంద్రప్రసాదు - తెలుగుపండిట్. పేరేచర్ల P.O గుంటూరుతాలూకా & జిల్లా ఫోన్: 0863 - 290409

విరాళము శైవవాణికి రు 58లు

1 TPLA134MK49



సంపుటి 33 సంచిక 11

శైవవాణి విజయవాడ

నవంబర్ 2001

వృషసం॥ - కార్తీకమాసం

ఎడిటర్

శ్రీ కొల్లిపర సుబ్బారావు
Ph: 08647, 46234

అధ్యక్షులు

శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవసంఘం

శ్రీ పొవులూరి సదాశివరావు
✆ 0866- 450607

కార్యదర్శి - సబ్ ఎడిటర్

గౌ॥ సంపాదకవర్గము

శ్రీ పూజ్యం వీరభద్రశర్మ

ఫోన్ : 0866 - 482711

శ్రీ తోలేటి వీరభద్రశర్మ - సహాయ కార్యదర్శి

శ్రీ సోమరాజుపల్లి వెంకటరామయ్య

శివ శ్రీ శంకరప్రియ

శ్రీ ఎన్. రామమోహనరావు

శ్రీ గూడూరు వెంకటహనుమంతరావు

చందాలు పంపవలసినఆఫీసు:

శ్రీ బోధానందఋష్యాశ్రమం

పున్నమ్మతోట,విజయవాడ -10.

ఫోన్ : 0866, 482711

<u>చందా వివరాలు:</u>

విడిపత్రిక	3-00
సం॥ చందా	30-00
శాశ్వత చందా	200-00



చంద్రశేఖర ధ్యానం

చంద్రశేఖర చంద్రశేఖర
చంద్రశేఖర పాహిమామ్
చంద్రశేఖర చంద్రశేఖర రక్షమామ్
రత్నసాను శరాసనం
రజితాద్రి శృంగనికేతనమ్
శింజనీకృత పన్నగేశ్వర
మచ్యుతానల సాయకమ్
క్షిప్రదగ్ధపురత్రయం
త్రిదివాలయై రభివందితమ్
చంద్రశేఖర మాశ్రయే
మమ కింకరిష్యతి వైయమః



<u>ఈ సంచికలో :-</u>

అభినందనలు

ది 14-10-2001 న విజయవాడ శివరామకృష్ణ క్షేత్రమందు జరిగిన ఆగమసదస్సు - రాష్ట్ర ఆగమ అర్చక మహాజనసభ జయప్రదంగా జరుగుట ముదావహము. వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతముల నుండి సభకు విచ్చేసిన ఆగమ పండితులకు, అర్చక సోదరులకు అభినందనలు. ముఖ్య అతిథులుగా ఆహ్వానించిన శ్రీ దేవాదాయశాఖ కమీషనర్, అడిషనల్ కమిషనర్లు అనివార్యకారణాలవల్ల రాకపోవుట నిరుత్సాహం కల్గి నప్పటికి శ్రీ కమీషనర్‌గారు చొరవతీసుకొని విజయవాడ శ్రీ కనకదుర్గాదేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీ గోపాలకృష్ణారెడ్డి, జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్‌కమిషనర్‌లను యీ సభలకు హాజరై సభవారు సమర్పించు నివేదికలను తమకు పంపవలసినదిగా ఆదేశించుట, పై అధికారులు సభకు హాజరై వారి సందేశముల నిచ్చుట సభవారికి సంతృప్తికలిగించినది.

సుమారు 20 సంవత్సరాలుగా ఇంతటి సమ్మేళనం జరుగలేదు. ఆగమ సదస్సు యీ సభల ప్రత్యేకత. ఆగమముల విశిష్టత - దేవాలయాలలో జరుగుపూజాదులు - ఉత్సవములు వానిలో చేయదగిన సంస్కారములు- వాటిని పాటించనిచో కలుగు దోషము - వాటికి ప్రాయశ్చిత్తము మొదలైన విషయాలు ప్రజలు గ్రహించుటకు శైవ, వైఖానస, పాంచరాత్ర, స్మార్త ఆగమపండితుల సందేశములు చాలా దోహద పడినవని భావిస్తున్నాము -

శివరామకృష్ణక్షేత్ర అధ్యక్ష కార్యదర్శులు యీ సభలకు వసతి సౌకర్యాలు కలిగించి ధన్యతనొందినారు. యీ సభలు హుందాతనంతో, క్రమశిక్షణతో నిర్వహించుటకు తోడ్పడిన అర్చకమహాశయుల కార్యకర్తల కృషి ప్రశంసనీయము. యీ సభలకు విరాళములిచ్చిన అర్చకసోదరులకు కృతజ్ఞతాభినందనలు. ప్రతిసంవత్సరము ఒక్కొక్క జిల్లాలో ఇట్టి సదస్సులు నిర్వహించిన ప్రజానీకమునకు ఆగమ ధర్మాలు అర్చకుల సమస్యలు తెలిసికొనే అవకాశం కలుగగలదని భావిస్తున్నాము.

పూజ్యం వీరభద్రశర్మ
సంపాదకులు

దేవాలయ వ్యవస్థకు వేదాగమములే ప్రమాణము

శ్రీమేధాదక్షిణామూర్తినే నమః - పూజ్యం వీరభద్రశర్మ

శైవాగమములు - ధర్మములు

భారతదేశంలో ధర్మస్వరూపాన్ని నిరూపించేవీ, నియమ నిబంధనలను ఏర్పికూర్చేవీ, ఆధ్యాత్మిక తత్త్వానికి రూపాన్ని తీర్చి దిద్దేవీ, ఐహికాన్ని, ఆముష్మికాన్ని సమిష్టిగా ప్రతిపాదించేవీ, సత్క్రమజీవితానికి త్రోవలు తెలిపేవీ రెండే రెండు గ్రంధాలు. 1. వేదములు 2 ఆగమములు. రెండును పరమేశ్వర ముఖోద్గతములే, రెండును దైవికములే, రెండును తుల్య ప్రమాణములే, ధర్మాది నిబంధన గ్రంధాలే.

లోక కళ్యాణమును కాంక్షించి మానవులలో ఆధ్యాత్మిక తత్వాన్ని, భక్తి తత్వాన్ని ప్రబోధించి, ధర్మమార్గావలంబనలో ప్రవర్తించుటకు మన పూర్వులు ప్రతి గ్రామంలోనూ శివాలయములు, విష్ణ్వాలయములు స్థాపించి కర్షణాది ప్రతిష్ఠాంతము, ప్రతిష్ఠాద్యుత్సవాంతకం, ఉత్సవాది ప్రాయశ్చిత్తాంతం శైవాగమ సాంప్రదాయ పద్ధతిని శివాలయములందును, విష్ణ్వాలయములలో వైఖానస-పాంచరాత్ర ఆగమసాంప్రదాయ పద్ధతిని నిర్వహించు ఏర్పాట్లు గావించబడినవి.

ఆగమములందు ప్రతిపాదింపబడిన అంశములు

కర్షణాది ప్రతిష్ఠాంతమగు దేవాలయ సంబంధిత కార్యకలాపములు- దేవాలయ నిర్మాణావశ్యక శిల్పకళాచాతురిని, అందు నిబంధింపతగిన సూత్రజాలము, అచ్చట ప్రతీకలకు కావింపవలసిన కళాన్యాస రహస్యములను, అందు జరుగదగిన పూజా స్వరూప నిరూపణమును, అందుకు అర్హులగు ఆచార్యపరంపరను, వారి లక్షణ విశేషణములను, వారి జీవికకై ఏర్పరుపదగిన భూదానములను, అట్లివ్వనిచో కలుగగల వైపరీత్యములను, అర్థార్థియై ఆచార్యుడు వ్యవహరింప కూడదనుటను, వివరంగా ప్రతిపాదించియున్నవి.

దేవాలయములందు జరుగదగిన దైనందిన, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ (కల్యాణోత్సవ) స్వరూపమును విపులీకరించినవి. పూజా విధానాదులయందు ఏవేని వ్యత్యాసములు పొడసూపిన, అవాంతరములు తటస్థిస్తే, దోషములు కలిగితే, ప్రతిక్రియలను, పరిహారములను, ఆవశ్యక కరణీయ జాలమును విశదపరుస్తున్నవి.

శైవాగమములు అష్టావింశతి 28 సంఖ్యాకములు

"కామికం యోగజం చింత్యం కారణం త్యజితం తథా।
దీప్తం సూక్ష్మం సహస్రం చ అంశుమాన్ సుప్రభేదకం ।
విజయంచైవ విశ్వాసం స్వాయంభువ మధానలం।
వీరం చ భైరవంచైవ మకుటం విమలం తథా।
చంద్రజ్ఞానంచ బింబంచ ప్రోద్గీతం లలితంతథా।
సిద్ధం సంతాన శర్వోక్తౌ పారమేశ్వరమేవచ।
కిరణం వాతులంచేతి అష్టావింశతి రాగమాః॥

ఈశ్వరుని పంచముఖములనుండి ఉద్భవించిన ఈ ఆగమాలు

1. కామికం 2. యోగజం 3. చింత్యం 4. కారణం 5. అజితం. ఈ అయిదున్నూతన ఇచ్ఛ లేక, కామనవలన జీవుల స్థూల సూక్ష్మ శరీరముల ప్రేరేపించునది కావున మూర్తియందురు." **"సద్యోజాతమూర్తయేనమః"**।
2. దీప్త, సూక్ష్మ, అంశుమత్, సుప్రభేద అను నాలుగు ఆగమములు వామదేవముఖోద్గతములు. వామన మనగా క్రూరము, దేవమనగా ప్రకాశము లేక జ్యోతి. అది జీవులను మాయలో ముంచును, కావున దీనికి గుహ్యామనిపేరు. అయ్యది బిందువునుండి విజ్ఞానమును ప్రసాదించును. **"వామదేవ గుహ్యాయనమః"**.
3. విజయ, విశ్వాస, స్వాయంభువ, అనల, వీరములను నాలుగు ఆగమములు అఘోరముఖోద్గతములు. అఘోరమన జ్ఞానము, స్థానము, హృదయము గావున దానికి హృదయమని పేరు, **"అఘోరహృదయాయనమః"**.
4. భైరవం, మకుటం, విమలం, చంద్రజ్ఞానం, బింబం. ఈ ఐదున్నూ తత్పురుష సముద్భవములు, ఇవి సర్వజీవులయందును అంతర్యామిగానుండును. దీనికి వక్త్రము అనిపేరు. ఇది విశ్వమును సప్తసముద్రములలో నింపును. **"తత్పురుష వక్త్రాయనమః"**.
5. ప్రోద్గీతం, లలితం, సిద్ధం, సంతానం, శర్వం, పారమేశ్వరం, కిరణం, వాతూలం అను 8 ఆగమములు ఈశానముఖోద్గతములు. ఈశానుడనగా శాస్త్రమూర్తి అని కూడా అందురు. తత్ప్రదానుగ్రహం ఆతనీయవలసినదే **"ఈశానమూర్తయే నమః'**

ముఖ్యముగా కారణాగమం - కామికాగమం - సుప్రభేదాగమంననుసరించి ఆంధ్ర - తమిళ, కర్ణాటక రాష్ట్రములందు దేవాలయ కార్యక్రమాలు అన్నీ నిర్వహింపబడుచున్నవి. మిగతా ఆగమాలు లభ్యమగుట లేదు.

ఆగమములు అన్నీ 4 పాదములుగా విభజింపబడియున్నవి. అవి 1. చర్యాపాదము 2. క్రియాపాదము 3. యోగపాదము 4. జ్ఞానపాదము లేక విద్యాపాదము.

1. చర్యాపాదమునందు లక్షణములు, విధులు చక్కగా వర్ణించబడినవి.
2. క్రియాపాదము నందు ఆలయ నిర్మాణ పద్ధతులు, వాటికి కావలసిన వాస్తు స్వరూపము, దేవాలయములందు గావింపవలసిన పూజా విధానాదులు వివరించబడినవి.
3. యోగపాదమునందు శక్తిపాతము, యోగస్వరూపము, సిద్ధి, అద్వైత ప్రాప్తి, లేక ఐక్య ప్రాప్తియున్నూ నిరూపించబడినవి.
4. జ్ఞానపాదము యోగజ్ఞానమున అజ్ఞానావధులు దాటించి జ్యోతిః ప్రపంచానికి తార్చి ఐక్యానుభూతికి వలయు శక్తిపాతమును కావించి విశుద్ధ యోగావిష్కారముతో ఐక్యమునుగూర్చి శివతాదాత్మ్యమును, శివాద్వైతాన్ని పొందిస్తూ, జ్ఞానానికి పరమ ప్రయోజనాన్ని సాధిస్తున్నాయి. అందువల్ల జ్ఞానపాదం ఆగమానికి తలమానికము. ఆగమాలు దైవపూజా విధానమును, తద్విశేషములను, నిర్దేశించుటయేగాక సంపూర్ణ అద్వైతప్రాప్తిని, శివైక్యమును ప్రతిపాదించి ప్రాప్తవ్యమును నిరూపించుచున్నవి.

శివాలయములందలి ఆచార్యార్చకులు

శివాలయములందు అర్చనాది విధులు నిర్వహించువారు ఆదిశైవులు. ఆది శైవసాంప్రదాయము దూర్వాస సాంప్రదాయము. దీనిలో దూర్వాస మహర్షి శివావతారముగా కీర్తింపబడినాడు. ఆతడే అఘోరశివాచార్యుడు అతడు గోదావరీ తీరమున కాళేశ్వరక్షేత్రమందు నూరేండ్లు తపస్సు చేశాడు. స్వసంకల్పాను సారమున నలువురు పుత్రులు పడసినాడు. వారు ఆది శైవ, మహాశైవులు, ఆర్య, శైవభూషణులు - వీరు ఆయన తమసృష్టి ప్రయోజనమును వివరింపుమనగా, భగవంతుడు దూర్వాసుడు వారిని శైవాలయములలో స్వార్థ పరార్థయజనములను నిర్వహింపుడని, కర్షణాది ప్రతిష్ఠాంతము-ప్రతిష్ఠాద్యుత్సవాంతము, ఉత్సవాది ప్రాయశ్చిత్తాంతము శివోక్తమైన వేదాగమ మార్గంలో పూజాకలాపాలు నిర్వహణం చేయవలసినదని ఆదేశిస్తాడు.

ఉత్తరకామికం పుట

ఆచార్యసంకరే రాష్ట్రం రాజానం నాశయత్యధ
ఏకాచార్యేణకర్తవ్య మేకదేవాలయస్థితం ॥ ౮౮౧
కర్మాన్యేనకృతం తచ్చే త్తత్స్యాదాచార్యసంకరః॥

పూర్వకారణం 190 పుట

ఆదిశైవస్య కర్తవ్యమాత్మార్థం చ పరార్థకం
స్థాపనంయజనం సర్వం ఆదిశైవార్హ కోవిదుః 14
కృతంచేదన్య ధా స్యాతామాభి బారాయచైవహి
యథాగౌరన్య వత్సస్య న దదాత్యేన తద్రసం॥ 15

పూర్వకారణం పుట 209

ఆగమోక్తప్రకారేణ ప్రతిష్ఠాలిఙ్గపూజనం॥ 23
ఆదిశైవస్య పూజాచ సర్వసిద్ధికరస్మృతా
అన్యవిప్రస్పృశేనైవ సవై దేవలకోభవేత్ ॥ 24
యది మోహేన కుర్వీత రాజ్ఞోరాష్ట్రస్య దుస్థితిః 24 1-2

పూర్వకారణం పుట 698

స్పృష్టేదీక్షాంతరైర్బింబే గర్భగేహేప్రవిష్టకే ॥ 198
పరచక్రాద్భయుంభూమౌ రాజాదుర్జయమాప్నుయాత్ ॥ 198

పూర్వకామికం పుట

శ్లో॥ దీక్షావిహీనవిప్రాద్యా స్త్రీ వర్ణాశ్శూద్రజాతయః
సవర్ణాద్యనులోమాశ్చ శిల్పి నఃకారుకాదయః ౧౧౧

పఠన్తి శివశాస్త్రంచే త్తత్పాపాన్నృపరాష్ట్రయోః
అచిరేణవినాశస్స్యాత్తస్మా ద్రాజానివారయేత్ ॥ ౧౧౨
శివసిద్ధాంతతంత్రేణ ప్రారబ్ధంకర్షణాదికం
సకుర్యాదన్యశాస్త్రేణ కుర్యాచ్చే త్తంత్రసంకరః ౧౧౩
తంత్రసంకరదోషేణ రాజారాష్ట్రం వినశ్యతి ॥ ౧౧౩ ౧ ౨

పూర్వకామికం ౩౧ పుట శ్లో ౧౨౧

శ్లో॥ శైవస్సర్వాధికారీస్యాత్ స్వకీయేచపరత్రచ
పూర్వకామికం పుట ౩౨

శ్లో॥ ముఖ్యత్వాదిహశైవస్య ముఖమాహాత్మ్యతోపిచ
అధికారోస్తి సర్వత్ర నాన్యేషాం శివదర్శనే॥

పూర్వకామికం ౩౨ పుట

శ్లో॥ తస్మాత్పరార్థమాత్మర్థం స్థాపనం యజవంతథా
శివవిప్రేణకర్తవ్యం అన్యేషాం స్వార్థమేవహి॥ ౧౨౫ ౧ ౨
పరార్థమపికుల్యాచ్చే ల్లో పేననృపతేస్తథా
తద్రాష్ట్రస్య చ నాశస్యా దచి రేణ ససంశయః ౧౨౬ ౧ ౨

పూర్వకామికం పుట ౧౦౭

పరార్థయజనం కార్యం శివవిప్రైస్తు నిత్యశః
ధార్మికః కథ్యతేనిత్యమాదిశైవోద్వి జోత్తమః ౪
అన్యేతుస్వార్థకాదన్యం కుర్యశ్చేత్కర్తృనాశనం

పూర్వకామికం ౧౦౪ పుట

ఆదిశైవాస్వయోద్భూత శ్శివదీక్షాభిషిక్తకః
పంచగోచరసంభూత శ్శివానుష్ఠానతత్పరః 6
శైవసిద్ధాంత శాస్త్రజ్ఞ శ్శివార్చనరతస్సుధీః
దేవాగ్ని గురుభక్తశ్చ, శివలక్షణలక్షితః
శివశ్చాతీ సుపుష్టాంగ స్సర్వ ప్రాణిదయాపరః
ఈదృశంగురుమాపాద్య వృణీయాత్స్థాపనాయవై 8

ఉత్తరకామికం పుట 64

ఆదిశైవకులే జాతశ్శ్రేష్ఠస్స్యాత్స్థాపనాదిషు
విప్రాదయశ్చతుర్వర్ణా అపియోగ్యాస్స్వకర్మణి॥ 5
దీక్షాయాం సర్వమర్త్యానాం ప్రతిష్ఠాయా మహోత్సవే
స్నపనేప్రోక్షణేచైవప్రాయశ్చిత్తేஉ భిషేచనే ॥ 6
వ్యాఖ్యానాదౌ చశస్తస్స్యాత్స్వార్థేవాథపరార్థకే
సర్వదేవార్చనే విప్ర స్త్వాదిశైవోగురూత్తమః 7

కారణాగమమ్
నిత్యార్చనా పద్ధతులు - సంస్కారములు

ఆగమిక శివార్చనావిధి ప్రకారము తెల్లవారుఝామున శివనామ స్మరణం చేస్తూ నిద్రలేచి దంతధావనాది కృత్యములు, స్నాన సంధ్యావందనాద్యనుష్ఠానములు నిర్వర్తించుకొని శుభ్ర వస్త్రములు, భస్మరుద్రాక్షలు ధరించి, ప్రదక్షిణ క్రమంగా ఆలయం ప్రవేశించి అస్త్రమంత్రముచే దేవాలయ ద్వారములు తెరచి, లోపల ప్రవేశించి, శుభ్రపరచి, దీపారాధన గావించి, గర్భాలయ ప్రవేశంచేసి, అస్త్రమంత్రముతో స్వయముగా శుద్ధోదకముతో గర్భాలయమంతా ప్రోక్షించి, శుభ్రపరచి ముగ్గులు వేయించవలెను.

అటుపిమ్మట పూజోపకరణములన్నిటినీ పరిచారకునితో శుభ్రము చేయించి తటాకాది తీరములకు వెళ్లి స్నపన కలశతో ఉదకము తీసికొని వచ్చి మహాఘంటానాదము చేసి ఆలయమందు స్వామివారలకు అర్చనాది విధులు యథావిధిని ప్రారంభించవలెను.

తత్పాచమనంచేసి ప్రాణామాయం దేశకాలములతోసంకల్పము - గోత్రనామములు చెప్పుకుని మొదట విఘ్నేశ్వర పూజ గావించిన పిమ్మట సౌరపూజ, క్షేత్రపాలపూజ, వృషభపూజ ద్వారపాలార్చనం - ద్వారపూజ, త్రివిధ విఘ్నోద్వాసనం, అస్త్రరాజార్చనం, అనంతరం గురుధ్యానం చేసి, సకలీకరణం చెప్పుకుని మనస్సునందు శివుని స్మరిస్తూ పూజాక్రమము జరుపవలెను.

పాత్రాసాదనానంతరం స్నపనకలశార్చన చేసి ఆ ఉదకంతో సర్వద్రవ్యములు ప్రోక్షించి శంఖార్చన చేయవలెను. అనంతరం పాత్రద్రవ్యనిక్షేపణం వాని సంస్కారములు, ఆత్మశుద్ధి, మంత్రశుద్ధి అనంతరం లింగశుద్ధి చేసి పీఠపూజ చేసి ఆవాహనాద్యుపచారములు చేయవలెను.

మలాపకర్షణ స్నానం, పంచామృతస్నానం, అనంతరం సద్యోజాతాది మంత్రములు హృదయాద్యంగమంత్రములు, వ్యోమవ్యాపినీ మంత్రములతో, నమక, చమక, పురుషసూక్త, దశ్శాంతులతో, సామ్రాజ్య పట్టాభిషేక మంత్రములతో నారికేళ, ఫలరసములతోను స్నపన జలంతో ఈశ్వరునికి అభిషేకము చేయవలెను. అనంతరం వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, అక్షతలు, పుష్పములతో భవాద్యష్ట నామములు - సద్యోజాత మంత్రములచే హృదయాద్యంగ మంత్రములచే పూజించి ధూపదీప నివేదనములు చేసి మనోరధముద్రను ప్రదర్శించి, నిరోధార్ఘ్యం సమర్పించవలెను.


అనంతరం పంచావరణదేవతా పూజలు, దేవీపూజ చేసి అనంతరం ఆవరణ పూజ చేయవలెను. పునః సంకల్పంచేసి గంధాదులతో అర్చించి ధూపదీప నివేదనలు, తాంబూల నీరాజనములు, మంత్ర పుష్పముచెప్పి పుష్పములు సమర్పించి, ఛత్రచామరాదులు సమర్పించి ఆత్మ ప్రదక్షిణ నమస్కారాదులు చేయవలెను. అనంతరం తీర్థప్రసాదములు స్వీకరించి, గోత్రనామములు చెప్పుకుని, సకుటుంబస్య క్షేమస్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధి రస్త్వితి భవంతో మహంతోనుగృహ్ణంతు, రాజారాష్ట్ర గ్రామ యజమానాచార్యార్చక పరిచారక దాసదాసీనాం నిశ్చలాఖండ శివపదారవింద ధ్యానా వాప్తి రస్త్వితి భవంతో మహంతోనుగృహ్ణంతు। సర్వే జనాస్సుఖినోభవన్తు। అని చెప్పి పరాఙ్ముఖార్ఘ్యం సమర్పించి ఓం భూర్భువస్సువరోమితి నిర్వాణ ముద్రయా స్వాత్మని మహాదేవం యోజయేదిత్యర్చన విధిః.

అనంతరం పునః పూజ గావించి పరివార దేవతార్చన చేయవలెను. మధ్యాహ్నం కాలమందు మధ్యాహ్నిక పూజ మహా నివేదనలు చేయవలెను - సాయంకాలమందు మరల ప్రదోషకాల పూజ చేయవలెను. ఈ విధముగా ఆగమిక శివార్చనావిధిని అనుసరించి శివాలయములందు నిత్యారాధన గావింపనగును.

పూజ్యం వీరభద్రశర్మ
శ్రీబోధానంద ఋష్యాశ్రమం, విజయవాడ - 10

ఆగమ పండిత సదస్సు

14 - 10-2001 ఆదివారం ఉదయం 9-30 నుండి మధ్యాహ్నం గం 12-30 వరకు శైవవాణి సంపాదకులు, శైవాగమపండితులు అయిన శ్రీపూజ్యం వీరభద్రశర్మ అధ్యక్షతన జరిగినది - సప్తగురుధ్యానం తర్వాత జ్యోతిష విద్యాపీఠ అధ్యక్షులు , ప్రముఖ న్యాయవాది అయిన శ్రీ యాబలూరి లోకనాధశర్మ జ్యోతిప్రజ్వలన గాలించారు.



పాంచరాత్ర ఆగమం తరపున సింహాచలం దేవస్థానం అర్చకస్వాములు శ్రీ మోర్త శ్రీసీతారామాచార్యులు, వైఖానస ఆగమం తరపున శ్రీ అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు (రెడ్డిపాలెం - గుంటూరుజిల్లా), స్మార్తఆగమం తరపున విజయవాడ శ్రీ కనకదుర్గ దేవస్థానం అర్చకస్వాములు (రిటైర్డ్) శ్రీ కుందుర్తి సత్యనారాయణమూర్తి గార్లు వేదిక నలంకరించారు.



శ్రీ పూజ్యంకామేశ్వరశర్మ ముఖ్య అతిధులను వేదికపైకి ఆహ్వానించి స్వాగతం పలికారు.

అధ్యక్షులు శ్రీ వీరభద్రశర్మ ప్రారంభోపన్యాసం గావిస్తూ వేదాగమములు పరమేశ్వరముఖోద్గతములని, దేవాలయములందు జరుగదగిన కార్యకలాపములు- ప్రతిష్ఠాదులు - ఉత్సవములు- దేవాలయ నిర్మాణాదులు ఆగమ ధర్మాలననుసరించి జరగాలని, నేడు అర్చకసమస్యలతో బాధపడుచూ అర్చక కుటుంబాలు ఆగమవిద్యకు తగుప్రోత్సాహమివ్వక తమ పిల్లలను ఇతరవృత్తి విద్యలకు పంపుచున్నారని అందువల్ల సుశిక్షితులైన ఆగమపండితులు

తయారుకావడంలేదని, ఇలాగే కొనసాగితే క్రమంగా ఆగమ పండితులు కరవై ఆగమవిద్యార్థులకు విద్యనేర్పేవారే ఉండరని - ఆగమవిద్యను ప్రభుత్వం ప్రోత్సహించాలని, రాష్ట్రంలో ఆగమపాఠశాలలు 3,4 మాత్రమే వున్నాయని ఇవి అర్చకవిద్యార్థులకు అందుబాటులో లేవని, అన్నిశాఖల ఆగమములు సేకరించి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, ఆగమగ్రంథాలు ప్రభుత్వంముద్రించాలని కోరారు.

సింహాచలం దేవస్థాన పాంచరాత్ర ఆగమపండితులు శ్రీమాన్ మోర్త శ్రీసీతారామాచార్యులుగారు శ్రీపూజ్యంవీరభద్రశర్మగారు సేకరించి ప్రచురించిన "శివప్రతిష్ఠావిధి గ్రంథమును ఆవిష్కరించారు - శ్రీయాబలూరిలోకనాధశర్మగారు శివప్రతిష్ఠావిధిలోని జలాధివాస, ధాన్యాధివాస, పంచశయ్యాధివాసముల ప్రాముఖ్యత దేవతామూర్తుల ప్రకాశమునకు కళాన్యాసములు అవసరమని, సక్రమ జీవితానికి వేదాగమములు మార్గాలని, అర్చకుడు లేనిదే దేవాలయమేలేదని ఆగమ శాస్త్రానుగుణంగా దేవాలయాలలో అర్చకుడు పూజాదులు నిర్వహిస్తాడని, ఆధ్యాత్మిక భక్తితత్వాన్ని ప్రబోధించే ఆగమశాస్త్రాలను అభివృద్ధి పరచడాన్ని ప్రభుత్వం శ్రద్ధతీసికోవాలని, అర్చకులకు గౌరవం, ఆదాయవనరులను కల్పించడంలో ప్రభుత్వం విఫల మౌతోందని అన్నారు. ఆగమపాఠశాలల ఆవశ్యకతగురించి శ్రీ కుందుర్తి సత్యనారాయణమూర్తి, ఆగమగ్రంథాలయాల ఆవశ్యకతగురించి శ్రీ మోర్తశ్రీనివాసాచార్యులు, అర్చకపరీక్షలు సిలబస్ గురించి శ్రీ అగ్నిహోత్రం శ్రీసీతారామాచార్యులు ప్రసంగించారు యింకను ఆగమముల ప్రాముఖ్యాన్నిగురించి డా॥ వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగారు, (నర్సరావుపేట) శైవాగమ అర్చక పరీక్షాధిపతుల అడ్వయిజరీబోర్డ్‌మెంబర్ శ్రీ కారంచేటి పార్వతీశం గురుకుల్, శ్రీకారంచేటి సాంబశివశర్మ, శ్రీ నాగలింగం హరిహరపంత్ శ్రీ కొల్లిపరకృష్ణమూర్తి, శ్రీపూజ్యం విశ్వనాథం ప్రభృతులు ప్రసంగించారు.

రాష్ట్ర ఆదిశైవ సంఘాధ్యక్షులు శ్రీకొల్లిపరసుబ్బారావు, కార్యదర్శి శ్రీపావులూరి సదాశివరావుగార్లు తమసందేశముల నిచ్చారు. శివశ్రీశంకరప్రియ వందన సమర్పణగావించారు.

ఆగమపాఠశాల విషయమై సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించిన అంశములు.

ఆగమపాఠశాలలు ప్రాముఖ్యత

ఆగమములందు ప్రతిపాదించబడిన కర్షణాది ప్రతిష్ఠాంతమగు దేవాలయములకు సంబంధించిన కార్యకలాపములు, దేవాలయ నిర్మాణము, శిల్పకళ, దేవతా మూర్తులకు కళాన్యాస రహస్యములు, దేవాలయములందు జరుగదగిన దైనందిని, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవ కల్యాణోత్సవ, బ్రహ్మోత్సవములు మరియు పూజా విధానములందు, ఉత్సవాదులయందు, ప్రతిష్ఠలందు ఏవేని వ్యత్యాసములు, అవాంతరములు తటస్థించినపుడు వానికి తగిన ప్రాయశ్చిత్త పరిహారములు, దేవతామూర్తులు ప్రతిష్ఠలందు బీజాక్షరములతో కూడిన యంత్రస్థాపన మొదలగు విశేషములు ఆగమశాస్త్రము లందు విశదీకరింపబడినవి. ఇవి అవశ్య ఆచరణీయములు - అనుసరణీయములు.

దేవాలయ వ్యవస్థకు అత్యంత ప్రధానమైన యీ ఆగమ విద్యను అభ్యసించుటకు ఆగమపాఠశాలలు అందుబాటులో లేక ఆగమ విద్యార్థులు చాలా యిబ్బంది పడవలసిన పరిస్థితి కలిగినది. తిరుమలలోని ధర్మగిరి యందు నడుపబడుచున్న యస్.వి.వేదపాఠశాల ఒక్కటే సమగ్రంగా ఈ ఆగమశాస్త్రవిద్య నభ్యసించు విద్యార్థులకు అవకాశం కల్పించినది - కీసరగుట్ట - ద్వారకా

తిరుమల - ప్రొద్దుటూరు ఆగమపాఠశాలలు నిత్యారాధన - ఉత్సవాదుల వరకు మాత్రమే ప్రవేశపెట్టినవి. మనరాష్ట్రం మొత్తం మీద 3,4 పాఠశాలల కంటే ఎక్కువ లేవని విశదమగుచున్నది. ప్రతి జిల్లాకు ఒక్క ఆగమపాఠశాలయినా ఉండవలసిన అవసరం వున్నది.

మనరాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖవారు అత్యంత ప్రాముఖ్యం యివ్వవలసిన ఈ ఆగమ విద్యనభ్యసించుటకు ఆగమ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి అర్చక పరీక్షా యోగ్యతా పత్రము లేనిదే అర్చకత్వ అర్హత లేదని అర్చక పరీక్షలు మాత్రం నిర్వహిస్తున్నారు.

ఇతర విద్యలకు కోట్లాది రూపాయలు ప్రజాధనం వెచ్చిస్తున్న మనరాష్ట్ర ప్రభుత్వం, ప్రజాధనం ఖర్చుపెట్టనవసరం లేని ఆ ఆగమశాస్త్రవిద్యను, ఉపేక్షించినది. దేవాదాయ చట్టంలో సుప్రీం కోర్టు తీర్పులో అత్యంతావశ్యకమయిన ఆగమసాంప్రదాయములను పరిరక్షించాలని రీఫ్రెషర్ కోర్సులు - ఆగమ పాఠశాలలు - కుమారాధ్యాపక పథకము నిర్వహించి ఆగమార్చక విద్యార్థులకు శిక్షణ యిప్పించాలని నిర్దేశించియున్నది. కామన్‌గుడ్ ఫండ్ నుంచి, దేవాలయములనుండి వసూలుచేస్తున్న కంట్రిబ్యూషన్ నిధుల నుండి - పెద్ద పెద్ద దేవస్థానముల మిగుల నిధుల నుండి ఈ ఆగమ శిక్షణాలయములకు ఖర్చుచేసే అవకాశమున్నప్పటికీ ప్రభుత్వదేవాదాయ శాఖ ఉపేక్షించినది.

ఇట్టి పరిస్థితిలో నిష్ణాతులైన ఆగమ పండితులు నేడు వేళ్లమీద లెక్కపెట్టే స్థితిలో వున్నది. సుశిక్షితులైన ఆగమ విద్యార్థులు తయారుకావడం లేదు. ఆగమ శాస్త్ర సాంప్రదాయములు క్రమంగా ఎవరికీ తెలియని స్థితి ఏర్పడే ప్రమాదమున్నది. వేదమంత్రములతో, సంస్కృత పదజాలంతో కూడిన ఆగమవిద్య క్రమశిక్షణతో అభ్యసింపవలసియున్నది.

దేశ-రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనునిత్యం దేవాలయ పూజలందు, ఉత్సవములందు సంకల్పం చెప్పబడుతూ ఉంటుంది. దేవాదాయశాఖ కార్యాలయమందు ఆయా ఆగమ శాఖల పండితులను నియమించి ఆగమశాస్త్ర సంప్రదాయములు పరిరక్షించివలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నది. కర్నాటక దేవాదాయశాఖ ఆఫీసు నందు ఆయాఆగమపండితులను నియమించి వారి ద్వారా దేవాలయ ఆగమ సాంప్రదాయములు దేవాలయ అర్చక స్వాములకు విశదీకరింపజేస్తున్నారు. ఆగమగ్రంథముద్రణ - ఆగమగ్రంథాలయ - పరిశోధనలు కూడా అత్యంతావశ్యకము.

అర్చక సంఘాలు ఈ ఆగమపాఠశాలల విషయమై ప్రభుత్వదేవాదాయ శాఖ దృష్టికి తెచ్చినప్పటికీ నిర్లక్ష్యధోరణి ప్రత్యక్షంగా కనపడుచున్నది. దేవాలయవ్యవస్థను - ప్రాచీన సంప్రదాయములను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ప్రజలపైన కూడా వున్నది.

కావున రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి దేవాలయ వ్యవస్థకు మూలకందమైన ఆగమములను. ఆగమ సాంప్రదాయములను పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఆగమ సదస్సు కోరుచున్నది.


ధర్మోరక్షతి రక్షితః

విజయవాడ
14-10-200

పూజ్యం వీరభద్రశర్మ
అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ ఆగమపండిత సదస్సు, శివరామకృష్ణక్షేత్రం.

ఆంధ్రప్రదేశ్ అర్చకమహాజనసభ

ది 14-10-2001 ఆదివారం మ॥గం 2-30లకు శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవసంఘం 60వ వార్షికోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆగమ - అర్చకమహాజనసభ విజయవాడ - సత్యనారాయణపురంలోని శివరామకృష్ణక్షేత్రమందు రాష్ట్ర ఆదిశైవసంఘాధ్యక్షులు శ్రీ కొల్లిపరసుబ్బారావు అధ్యక్షతన జరిగింది. సభాకన్వీనర్సు శ్రీ పూజ్యం కామేశ్వరశర్మ, శ్రీపావులూరి రామచంద్రదీక్షితులు సభ్యులకు స్వాగతం పలికి అర్చకసమాఖ్య నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. యీ సభకు సుమారు 600 మంది పైగా హాజరయ్యారు.




ముఖ్య అతిథులుగా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, శ్రీ కనకదుర్గాదేవాలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ ఇ. గోపాలకృష్ణారెడ్డి, కృష్ణాజిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీ అమరయ్యగార్లు సభకు విచ్చేసి తమ సందేశములనిచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను పుష్పగుచ్ఛములతో, పట్టుకండువాలతో అధ్యక్షులు శ్రీ కొల్లిపర సుబ్బారావు సత్కరించారు.

ముఖ్య అతిథి శ్రీగోపాల కృష్ణారెడ్డిగారు తమ ప్రసంగంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. అర్చకుల సంక్షేమనిధికి శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్థానం నుండి 1 కోటిరూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. దేవాదాయశాఖలో వివిధ కేటగిరీలలో బాధ్యతలు నిర్వహించిన సందర్భంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు తాను గమనించానని అర్చకుల రిటైర్‌మెంటు తదితర సమస్యలను యీశాఖ కమిషనర్ శ్రీ అజయ కల్లామ్‌గార్కి వివరిస్తామన్నారు. ప్రస్తుత ఆదాయాలకు, చట్టంచేసేనాటికి ఉన్న ఆదాయాలకు చాలా వ్యత్యాసం ఉందని యీ విషయంలో దేవాదాయమంత్రి శ్రీదండు శివరామరాజు తగు మార్పులు చేయనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

అర్చకసమాఖ్య అధ్యక్షుడు శ్రీ టి. రామాచార్యులు మాట్లాడుతూ 30/87 చట్టం అమలులోకి వచ్చిన తర్వాత అర్చకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్చక వేతనాలకు బదులు లోగడ ఉన్న సర్వీసు భూములు ప్రభుత్వం స్వాధీనం చేసికొనుట అక్రమమన్ని, 58 ఏళ్లరిటైర్మెంటు నిలుపుచేయాలని అన్నారు. తెలంగాణా అర్చకసమాఖ్య అధ్యక్షులు ప్రొఫెసర్ సౌందరరాజన్ మాట్లాడుతూ దేవాదాయశాఖలో కొంతమంది అధికారులు అవలంబిస్తున్న వైఖరివల్ల అర్చకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ప్రస్తుతం ఉన్న అర్చకసర్వీసు భూములు యధాతథంగా ఉంచాలని, వీరికి రిటైర్‌మెంటు వయస్సు సమంజసంకాదని అన్నారు. అర్చకకాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ. యస్. సుబ్రహ్మణ్యశాస్త్రి, అర్చకసేవాసమితి అధ్యక్షులు శ్రీ దీవికోదండరామశర్మ, కర్నూలు జిల్లా అర్చకసంఘ కార్యదర్శి శ్రీ శ్రీకంఠం నందీశ్వర్, అర్చకసమాఖ్య కార్యదర్శి ఆచార్య ఆత్రేయబాబు ఆగమ పండిట్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ N.K. ఆచార్య అర్చక సమాఖ్య కోశాధికారి శ్రీ మొవ్వ వెంకట సుబ్బారావు, పశ్చిమగోదావరిజిల్లా అర్చకసంఘ అధ్యక్షులు శ్రీ పెద్దింటి పురుషోత్తమాచార్యులు, కృష్ణాజిల్లా అర్చకపరిషత్ కార్యదర్శి శ్రీవేదాంతం రామకృష్ణమాచార్యులు, తూర్పుగోదావరి జిల్లా అర్చకసంఘంకార్యదర్శి శ్రీ కె. వి. సీతారామాచార్యులు, విశాఖజిల్లా ఆదిశైవసంఘకార్యదర్శి శ్రీ అయలూరి శ్రీనివాసదీక్షితులు ప్రభృతులు అర్చకసమస్యలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

తొలుత శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘకార్యదర్శి శ్రీపావులూరి సదాశివశర్మ 60సం॥ర వార్షిక నివేదిక సభకు నివేదించారు. పలువురు అర్చకసంఘ కార్యకర్తలు ప్రసంగించారు. దేవాదాయశాఖ కమిషనర్‌వార్కి శ్రీ దుర్గామల్లేశ్వర దేవస్థానంకార్యనిర్వహణాధికారి ద్వారా వివిధ అర్చక సమస్యల పరిష్కారమునకు ఒక మెమోరాండం సమర్పించారు.



అర్చకమహాజనసభలో అధ్యక్షులు కొల్లిపర సుబ్బారావు గారు ప్రసంగిస్తున్న దృశ్యం

ఆగమ అర్చక మహాజన సభ

(ఈనాడు)

మధురానగర్, అక్టోబరు 14 (న్యూస్‌టుడే) : భగవంతుడిని పూజించే అర్చక వృత్తి పవిత్రమైందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ శ్రీ అమరయ్య అన్నారు. ఆయన ఆదివారం ఉదయం శివరామకృష్ణ క్షేత్రంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆగమ అర్చక మహాజనసభకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అర్చక పోస్టులకు పరీక్షలు నిర్వహించడం తగదన్న అర్చక మహాజనసభ సభ్యుల వాదనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. అర్చక కుటుంబాల నుండి వచ్చేవారిని గుర్తించి వారికి మాత్రమే అర్చక ఉద్యోగాలు ఇస్తున్నట్లు తెలిపారు. కనకదుర్గ ఆలయ కార్యనిర్వహణాధికారి గోపాలకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ అర్చకుల పదవీ విరమణ, అనంతరం లభించే సౌకర్యాల గురించి దేవాదాయ కమిషనర్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఉదయం ఆగమ సదస్సును జ్యోతిష విద్యాపీఠ అధ్యక్షులు యాబలూరి లోకనాథశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పూజ్యం వీరభద్రశర్మ అధ్యక్షత వహించారు.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడ, అక్టోబరు 14 (ప్రభాతవార్త) :

దేవాదాయ, ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ గోపాలకృష్ణారెడ్డి

రాష్ట్రదేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని దేవాదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కమిషనర్, దుర్గగుడి కార్యనిర్వహణాధికారి శ్రీ గోపాలకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సత్యనారాయణపురంలోని శివరామకృష్ణక్షేత్రంలో శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘ 60వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆగమ అర్చక మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అర్చకుల సంక్షేమ నిధికి దుర్గామల్లేశ్వర దేవస్థానం నుంచి కోటి రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. దేవాదాయ శాఖలో వివిధ కేటగిరిలలో బాధ్యతలు నిర్వహించిన సందర్భంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. అర్చకుల రిటైర్మెంట్, తదితర సమస్యలను కమిషనర్ శ్రీ అజయ్ కల్లామ్ దృష్టికి తీసుకువెళ్ళి విజయవాడ అర్చక మహాసభ తీర్మానాల అమలుకు తన వంతు కృషిచేస్తానన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అమరయ్య మాట్లాడుతూ అర్చకులు చేస్తున్న ఆందోళన న్యాయబద్ధమైనదన్నారు. 1987 చట్టప్రకారం అన్ని ఆలయాలను 6ఎ, 6బి, 6సి ఆలయాలుగా వర్గీకరించడం జరిగిందన్నారు. ప్రస్తుత ఆదాయాలకు, చట్టం చేసేనాటికి వున్న ఆదాయాలకు తీవ్ర వ్యత్యాసం వుందని, ఈ విషయంలో మార్పులు చేయనున్నట్టు దేవాదాయ, ధర్మాదాయ శాఖామంత్రి దండు శివరామరాజు పేర్కొన్నట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య అధ్యక్షుడు శ్రీ టి. రామాచార్యులు మాట్లాడుతూ 30/87 చట్టం అమలులోకి వచ్చిన తరువాత అర్చకులు అనేక ఇబ్బందులకు గురికావల్సి వస్తోందన్నారు. దేవాలయ నిర్వహణకు అర్చకుల భృతికి కేటాయించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అక్రమమని ఆయన విమర్శించారు. 50వేల రూపాయల లోపు ఆదాయం వున్న భూములను అర్చకుల కింద వుంచి పర్యవేక్షణ చేయాలని, 58ఏళ్ళకు రిటైర్మెంట్ నిలుపుదల

చేయాలని, అవసరమైతే త్వరలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ధర్నా, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. తెలంగాణా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.వి.సౌందర రాజన్ మాట్లాడుతూ అర్చకుల రిటైర్మెంట్ సమంజసంకాదని, రిటైర్మెంట్ తరువాత ప్రభుత్వ ఉద్యోగి పొందే పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలో కొంతమంది అధికారులు అవలంబిస్తున్న వైఖరి వల్ల అర్చకులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేధింపుల కారణంగా అర్చకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిదండు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం అర్చకులు, దేవాలయాల అభివృద్ధికి ఒక కమిటీ నియమించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అర్చక మహాసభకు ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘం అధ్యక్షుడు కొల్లిపరసుబ్బారావు అధ్యక్షత వహించారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పలుతీర్మానాలను అర్చక మహాసభ ఆమోదించింది. అర్చక సంఘాల నాయకులు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీరాంబాబు, శ్రీ కొండమాచార్యులు అర్చకులు ఎదర్కొంటున్న సమస్యలను వివరించగా సమస్యల సాధనకు ఐక్యంగా అవసరమైతే ఆందోళనకు సిద్ధంకావాలని శైవవాణి సంపాదకులు పూజ్యం వీరభద్రశర్మ పిలుపునిచ్చారు.

ఆగమశాస్త్రాలను భావితరాలకు అందించాలి

విజయవాడ, అక్టోబరు 14 (ప్రభాతవార్త) : భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను సూచించే ఆగమశాస్త్రాలను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సత్యనారాయణపురంలోని శివరామకృష్ణక్షేత్రంలో శ్రీ ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ సంఘ 60వ వార్షికోత్సవం పురస్కరించుకుని శైవ, వైఖానస, పంచరాత్ర ఆగమ పండితుల సదస్సు జరిగింది. జ్యోతిష విద్యాపీఠ అధ్యక్షులు శ్రీ యాబలూరి లోకనాధశర్మ మాట్లాడుతూ సక్రమ జీవితానికి వేదములు - ఆగమములు మార్గాలుగా నిలుస్తాయన్నారు. ఆధ్యాత్మిక భక్తితత్వాన్ని బోధించే ఆగమశాస్త్రాలు పరిరక్షించుకోవటానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆగమశాస్త్రాల ప్రకారం అర్చకులు దేవాలయాల్లో పూజాది క్రతువులను నిర్వహిస్తారన్నారు. అర్చకులకు గౌరవం, ఆదాయ వనరులను దేవాదాయశాఖ సమకూర్చటంలో విఫలమవుతోందన్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం మాజీ ప్రధాన అర్చకులు శ్రీ కుందుర్తి సత్యనారాయణ మాట్లాడుతూ ఆగమశాస్త్రాలు సమాజానికి చట్టంలాంటివన్నారు. వేదాలనుంచి వచ్చిన ఆగమశాస్త్రాల బోధన ప్రక్రియలు తగ్గిపోయాయన్నారు. సామాజిక వ్యవస్థలో దేవాలయాల వైశిష్ట్యాన్ని పెంపొందించే ఆగమశాస్త్రాలు భావితరాలకు అందించేందుకు పెద్దదేవాలయాల్లో పాఠశాల్లో నిర్వహించాల్సిన అవసరం వుందని అభిప్రాయపడ్డారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ సీతారామాచార్యులు మాట్లాడుతూ దేవాదాయశాఖ నిర్వహించే ఆగమ పరీక్షలలో సిలబస్‌లోని పాఠ్యగ్రంధాలు అభ్యర్ధులకు అందుబాటులోలేవన్నారు. సిలబస్‌తో పాటు సరైన గ్రంథాలు అందుబాటులోకి తీసుకురావల్సిన అవసరం వుందన్నారు. లోకకళ్యాణం కాంక్షించే దేవాలయాలు, అర్చకులు శాస్త్రపరమైన పండితులతో సదస్సులు, శిక్షణ యిప్పించాలన్నారు. వేదాంతం శ్రీనివాసాచార్య మాట్లాడుతూ ఆధ్యాత్మిక రూపాన్ని ఆగమశాస్త్రాలు కల్పిస్తాయన్నారు. శైవాగమ పండితులు పూజ్యం

వీరభద్రశర్మ రచించిన 'కారణాగామ శివప్రతిష్ఠావిధిః' పుస్తకాన్ని సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ సీతారామాచార్యులు ఆవిష్కరించారు. ఆగమముల విశిష్టత, ఆగమ పాఠశాలల ఏర్పాటు అన్న అంశాలపై అర్చక సంఘం నాయకులు శ్రీ ఎస్. సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ కోదండరామశర్మ ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి శ్రీ పూజ్యం వీరభద్రశర్మ అధ్యక్షత వహించారు. ఆహ్వాన సంఘం కన్వీనర్లు పావులూరి సదాశివరావు, పూజ్యం కామేశ్వరశర్మ, కొల్లిపర సుబ్బారావు తదితరులు ప్రసంగించారు.

శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘము

Regd No s. 24 of 1940-41

మాచవరండౌన్ - విజయవాడ - 4

60వ వార్షికోత్సవము

కార్యదర్శి నివేదిక

మహాశయా!

శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవసంఘం 60వ వార్షికోత్సవం సందర్భంగా మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఆదిశైవ సంఘీయులకు, అర్చక సోదరులకు మిత్రులకు, శ్రేయోభిలాషులకు నమస్కారములు.

ఆంధ్రరాష్ట్ర మండలి అన్ని ప్రాంతములలో నున్న ఆదిశైవులలో ఐకమత్యము, సోదరభావము, సాంఘికసేవ, విద్యాభివృద్ధి కులక్రమానుగతంగా వచ్చుచున్న వేదాగమోక్తములగు కర్షణాది ప్రతిష్ఠాంతము, ప్రతిష్ఠాద్యుత్సవాంత దైవిక క్రియల యందును, మానుషక్రియల యందును సంఘబాలలను ఆరితేరిన వారిగా నొనర్చులకు వలయుసాధన సంపత్తిని చేకూర్చుట, అర్చక సంబంధమగునట్టి, దేవాలయ సంబంధమగునట్టి ప్రస్తుత చట్టమందు గల ఇబ్బందులు పరిశీలించి సవరణలు మార్పులు మొదలగు వానిని గురించి సంఘాభిప్రాయములను వెల్లడించుట, సంఘాభివృద్ధికి అవసరమైన విద్యలు నేర్పించుట, పత్రికలు, గ్రంథములు ముద్రించుట, సిద్ధాంత ఆగమోక్త ధర్మములను ప్రచారము చేయుట మొదలగు ఉద్దేశ్యములతో సంఘము స్థాపించబడినది.

తదాది ప్రతిసంవత్సరము వార్షిక సమావేశము జరుపుకొనుచూ, 3 సం॥రముల కొకసారి నూతన కార్యవర్గముల నెన్నుకొనుట, సంఘీయులకు అవసరమైన సమాచార ములందించుట. అవసరమగు సూచనలిచ్చుట, సంఘీయుల అభిప్రాయములు, సమస్యలు తెలిసికొని పరిష్కార ప్రయత్నములు చేయుట జరుగుచున్నది.

1945లో విజయవాడ మాచవరం డౌన్ నందు సుమారు 720 చ॥గ॥ నివేశన స్థలము సంఘము పేరకొనబడినది. 1969లో అప్పటి సంఘాధ్యక్షులు డా॥ రుద్రపాక వియ్యేశ్వర శర్మగారి కృషి సంఘీయుల ప్రోత్సాహంతో సదరు నివేశస్థలమందు ఆదిశైవ సంఘభవనం నిర్మించబడి ప్రారంభోత్సవం జరుపబడినది.

1969లో బ్ర॥ శ్రీ పాలపర్తి సీతారామ దీక్షితుల వారి ఆచార్యత్వమున శైవాగమ పాఠశాల ప్రారంభించి 5 సంవత్సరములువిద్యార్థులకు ఆగమ శిక్షణ యివ్వబడినది.

1971 అప్పటి దేవాదాయ కమీషనర్ శ్రీ కొండపల్లి వాసుదేవరావు గారు ఈ ఆగమ పాఠశాలను గుర్తించి మొదటి సం॥రం 3 వేల రూపాయల తరువాత 2 సం॥రములు 5వేలరూపాయలు చొ॥న ఈ పాఠశాలకు గ్రాంటు ఇచ్చితోడ్పడినారు. తరువాత దేవాదాయ శాఖ

నుండి గ్రాంటులు లభించక స్థానిక దేవాలయ సత్రములందు భోజన వసతికూడా కల్పించకపోవుటచే - సంఘ ఆర్థిక పరిస్థితిని బట్టి పాఠశాలను నడుపలేక ఆపివేయవలసివచ్చినది.

1968లో శైవవాణి మాస పత్రికకు డిక్లరేషన్ ఇచ్చి రిజిష్టర్ ఆర్డరు పొందుట జరిగినది తదాది ఈ 33 సంవత్సరముల నుండి పత్రిక సంఘీయులకు, అవసరమైన సమాచారములనందిస్తూ, అర్చక సమస్యలను సంఘసమావేశములను, ఆధ్యాత్మిక భక్తి సంబంధమైన విశేషాలు ప్రకటిస్తూ 33వ సం॥రంలో అడుగిడిన శైవవాణికి సుమారు 1500 మంది శాశ్వత చందాదారులు, 500 మంది సాధారణ చందాదారులను కలిగి సంఘీయుల విరాళములతో ఆదరాభి మానములతో పత్రిక నిరాటంకముగా నడుస్తున్నది.

సంఘమునకు అనుబంధంగా జిల్లా ఆదిశైవ సంఘములు. మండల ఆదిశైవ సంఘములు ఏర్పడి సంఘపురోభివృద్ధికి కృషి చేయుచున్నవి.

గ్రంథముద్రణ విషయంలో నిత్యార్చన పద్ధతులతో అభిషేక మంత్రాదులతో కూడిన ఆగమికశి వార్చనా విధి 4వ ముద్రణ కూడాచేసి సంఘ అర్చకసోదరులకు అందించబడినది.

మా సంఘములో ప్రముఖ వేదాగమ పండితులైన శ్రీ బోధానంద మహర్షుల వారు విజయవాడలో 1939లో శ్రీ బోధానంద ఋష్యాశ్రమం స్థాపించి అందు జగద్గురు శ్రీ శ్రీకంఠశివాచార్య గురు పీఠమును స్థాపించి శైవసిద్ధాంతములు, శ్రీకంఠ భాష్యము, గీతాభాష్యము, మాండూక్యో పనిషద్భాష్యము మొదలగు గ్రంథములు ముద్రించి ప్రచారం గావించి ఆదిశైవ సంఘీయులను ఉత్తేజ పరిచి 1953లో సిద్ధిపొందినారు. 1989లో శ్రీ బోధానందఋష్యాశ్రమం స్వర్ణోత్సవములు సంఘీయులు జరుపుకొన్నారు. శ్రీ బోధానందఋష్యాశ్రమం తరపున కూడా శైవాగమ కళ్యాణోత్సవ విధి, ఉత్సవ ప్రతిష్ఠా ప్రాయశ్చిత్తములు, శైవాగమ ప్రతిష్ఠావిధి గ్రంథములు ముద్రించి అర్చకలోకమునకు అందింపబడుచున్నవి. ప్రభుత్వ పరీక్షలు ప్రారంభించకముందే 1951, 52లో మా శ్రీకంఠవిద్యాపీఠం తరపున శైవాగ అర్చక పరీక్షలు నిర్వహించబడినవి.

అర్చక సమస్యల విషయంలో అన్ని శాఖల అర్చక సంఘాలతో కలసి కృషి చేయుచున్నది.

రాష్ట్ర వ్యాప్తంగా వున్న సంఘీయులను, వివిధ శాఖల ఆగమ పండితులను, అర్చక సోదరులను ఒకేచోట సమ్మేళన పరచి అర్చక సమస్యలు, ఆగమపాఠశాలలు, ఆగమ గ్రంథముద్రణ వంటివిషయాలు ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కార ప్రయత్నములు జరుగుటకుగాను ఈ ఆగమ అర్చక మహాజన సభను, ఆగమ సదస్సును అర్చక సోదరుల ప్రోత్సాహము, సహకారములతో ఏర్పాట్లు చేయగలిగినందుకు, మీరంతా ఈ సభలకు విచ్చేసి జయప్రదం గావించుచున్నందుకు ఆనంద పడుచూ, మీ అందరికీ కృతజ్ఞతాభివందనములు తెలియజేయుచున్నాను.

ఈ సభకు విచ్చేసిన దేవాదాయశాఖ అధికారులకు, నగర ప్రజలకు, అర్చక సంఘాల నాయకులకు ఆగమపండితులకు మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనలు.

ఈ మహాజనసభలు జరుపుకొనుటకు అవకాశం యిచ్చిన స్థానిక శివరామకృష్ణక్షేత్ర అధ్యక్ష కార్యదర్శులకు, ఇతర విధముల అవసరమైన సహాయ సహకారములు ఇచ్చిన వారందరికి మా కృతజ్ఞతాభివందనలు.

సర్వేజనా : సుఖినోభవంత

ఇట్లు
మీ విధేయుడు
పావులూరి సదాశివరావు, కార్యదర్శి
శ్రీ ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘము

విజయవాడ
14-10-2001.

శ్రీ దేవాదాయ శాఖ కమిషనర్‌గారికి సమర్పించిన మెమోరాండములోని ముఖ్యాంశములు

1. 1987 చట్టంచేసేనాటికి యిప్పటికి ధరవరలలో చాలా తేడావున్నందున "C" క్లాస్ టెంపుల్సు. రు.5000 నుండి 50వేల వరకు పెంచుట. 50వేలలోపు ఆదాయంగల దేవాలయాలలో కార్యనిర్వహణాధికారిని నియమించకుండుట.
2. కేటగిరీల మార్పుగురించి
   6(A) టెంపుల్సు - 15 లక్షలకు పైబడినవిగా గుర్తించుట
   6(B) టెంపుల్సు - 5లక్షల నుండి 15 లక్షలకు పెంచుట
   6 (C) టెంపుల్సు - 5లక్షలలోపు ఆదాయంగలవిగా నిర్ణయించుట. 1987 నాటికి ఇప్పటికి ధరవరలలో చాలాతేడావున్నందున పైవిధంగా కేటగిరీలు మార్పుచేయాలని కోరబడినది.
3. 6 (సి) దేవాలయములను 144వ సెక్షన్ నుండి మినహాయించి ఎగ్జంప్షన్ యివ్వాలని కమిషనర్ ఆఫీస్‌నుండి సర్క్యులర్ ఇచ్చినప్పటికి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్సు శ్రద్ధచూపలేదని కొంతమంది కార్యనిర్వహణాధికారులు భూములు స్వాధీనం చేయమని వత్తిడి తెస్తున్నారని కొన్ని చోట్ల స్వాధీనపరచుకొని అర్చకులను ఇబ్బంది కలుగచేస్తున్నారని, ఇది సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని హైకోర్టు స్టే ఆర్డర్సు ఇచ్చినప్పటికి అర్చకులను భయపెట్టుచున్నారని గావున వెంటనే 6 సి దేవాలయము 144వ సెక్షన్ నుండి మినహాయించి ఎగ్జంప్షన్ యిప్పించవలసినదిగా కోరబడినది.
4. సదరుదేవాలయాలు ఎగ్జంప్షన్ ఆర్డర్సువచ్చునప్పటికి ఆలస్యమగునేని, తాత్కాలిక ఉత్తర్వులు క్రింది అధికారాలకు యివ్వాలని కోరబడింది.
   అర్చకుల జీతములు చెల్లించుట గురించి: కొంతమంది కార్యనిర్వాహణాధికారులు నెలలతరబడి అర్చకులకు జీతాలు చెల్లించడంలేదని - సుప్రీంకోర్టు తీర్పునందు జీతములు చెల్లింపువిషయంలో అర్చకులకు ప్రధమస్థానం యివ్వాలని సూచించబడింది ఇకనుంచి అర్చకుల జీతములు బ్యాంకుల ద్వారా చెల్లించాలని కోరబడింది.
5. 6 A ,6 B దేవాలయాలలో అర్చకుల వర్గీకరణ జరిపి స్కేల్సు అమలుచేయాలని 1997 సుప్రీంకోర్టు తీర్పులో సూచించినప్పటికి చాలాదేవాలయాలలో జీతముల ఫిక్సేషన్ కాలేదు. ఇటువంటిచోట్ల జీతములు స్కేలు ప్రకారం ఇవ్వడం లేదని వీటిని జిల్లా హెడ్‌క్వార్టర్సులో సంబంధిత అధికారుల సమక్షంలో అర్చకుల సమక్షమున వర్గీకరణ జరిగి స్కేల్సు నిర్ణయించాలని కోరబడినది మరియు చాలాచోట్ల వంతుల పద్ధతిని అర్చకత్వం చేస్తున్నారని వీరికి జీతములు నిర్ణయించుట సాధ్యంకాదని, యిటువంటిచోట్ల అర్చకుల ఆధీనంలో గల భూములను స్పెషల్‌కేసుగా పరిగణించి అర్చకుల వద్దనున్న భూములు 144వ సెక్షన్‌నుండి - ఎగ్జంప్షన్ యివ్వాలని కోరబడింది.


6. అర్చకులు మామూలుపూజలుగాక ఉత్సవాదులలో విశేషపూజలు జరుపవలసి వచ్చుచున్నప్పుడు అదనపు రెమ్యూనరేషన్ అర్చకులకు యివ్వాలని సూచించినప్పటికీ ఆలయాధికారులు అమలు జరుపక అర్చకులపై అదనపు భారం మోపుచున్నారు. యీ విషయమై శ్రీ కమిషనర్ చొరవతీసికొని న్యాయం కలుగజేయవలసినదిగా కోరబడినది.
7. అర్చకుల సర్వీసు భూములపై కంట్రిబ్యూషన్ రద్దుచేయాలని జీతములు ఇచ్చుచోట కంట్రిబ్యూషన్ వసూలు చేయనపుడు జీతములకు బదులు భూములున్న అర్చకులపై కంట్రిబ్యూషన్ విధించవలదని, కాంప్రమైజ్ ఒప్పందంలో అర్చకుల సర్వీస్‌భూమిపై కంట్రిబ్యూషన్ వారిషేరు ప్రకారంచెల్లించాలని యున్నప్పటికి జీతములు బదులు భూములు కేటాయించినందున తగ్గింపు విషయమై పునరాలోచించవలసినదిగా కోరబడినది.
8. బలహీనవర్గాల ఇండ్లస్థలాలకు అర్చకుల సర్వీసుభూమి స్వాధీనంచేసికొని ఆ కాంపన్సేషన్ దేవాలయంపేరడిపాజిట్‌చేసి అర్చకులకు అందుపైవచ్చేవడ్డీని చెల్లించకుండా ఇబ్బందులు పెట్టుచున్నారు. యీ విషయమై సత్వరమే తగుచర్యలుగై కొనవలసినదిగా కోరడమైనది.
9. అర్చకుల రిటైర్‌మెంటు వయస్సు సెక్షన్ 53(3) మరియు రూల్సు సెక్షన్ 35(4) ననుసరించి 65సం॥రములు నిర్ణయించినప్పటికి ఖర్చులు ఆదాచేయుటకొరకు 58సం॥రములుగా నిర్ణయించారని, పెన్షన్‌వగైరా బెనిఫిట్సు కలుగజేయకుండా అర్చకులను రిటైర్‌మెంటు అమలుజరుపుట అన్యాయమని కోరబడింది
10. ఆగమసాంప్రదాయములు పాటించుట గురించి సుప్రీంకోర్టు సెక్షన్ 13 మరియు 142 సూచించిన ప్రకారం వంశపారంపర్యహక్కు రద్దుపరచినప్పటికీ సంప్రదాయములు పరిరక్షించాలని, ఆగమ అర్చకత్వ శిక్షణకు కుమారాధ్యాపక పథకం అమలు జరపాలని కోరబడినది.
11. C.G.F. కామన్‌గుడ్‌ఫండ్ నుంచి తగినన్ని నిధులు మంజూరుచేసి ఆగమపాఠశాలలు ఏర్పాటుచేసి అర్చకులకు శిక్షణయిప్పించాలని కోరబడినది.
12. సుప్రీంకోర్టు సూచించిన విధంగా అర్చకులకు సంక్షేమపథకాలు వర్తింపజేయాలని
13. అర్చకసంఘాలను తరచు సమావేశపరచివారి సమస్యలు పరిష్కరించాలని, అర్చకసంఘాల సూచనలు గమనించాలని కోరబడినది.
14. కొంతమంది అర్చకులస్వాధీనంలో అర్చకసర్వీసు నిమిత్తం ఇవ్వబడిన భూములు అమ్మునపుడు సుప్రీంకోర్టు సూచించినవిధంగా అర్చకులకు ప్రధమస్థానం ఇవ్వాలని కోరబడినది.

దేవాలయాధికారులు అర్చకులను వేధించకుండా ఆగమధర్మాల ప్రకారం తగు గౌరవస్థానం కల్పించాలని కోరబడింది.


ఇంగ్లీషులో కమిషనర్‌గారికి సమర్పించిన మెమోరాండంలోని అంశములు సంక్షిప్తంగా యిచ్చుట ప్రకటించినాము.

సంపాదకులు

అర్చకమహాజన సభ దృశ్యములు




14-10-2001 ఆగమసదస్సు జ్యోతిప్రజ్వలన దృశ్యం



ఆగమసదస్సు వేదికనలంకరించిన పండితుల దృశ్యం



శ్రీ పూజ్యం వీరభద్రశర్మగారిచే ప్రచురింపబడిన "శివప్రతిష్టా విధిః" గ్రంధావిష్కరణ దృశ్యం






ఆగమఅర్చక మహాజనసభ వేదికనలంకరించిన అర్చకసంఘాల నాయకులు




దేవాదాయశాఖ అధికారులను వేదికపైకి తీసుకువచ్చుచున్న దృశ్యం



అర్చకమహాజన సభలో ఉపన్యశిస్తున్న ప్రొ॥సౌందరరాజన్



అర్చకమహాజనసభకు హాజరైన అర్చక ప్రతినిధులు



అర్చకమహాజనసభకు హాజరైన అర్చక ప్రతినిధులు

దేవాదాయశాఖ పరిధిలోకి షిర్డీసాయి ఆలయాలు

తిరుపతి, అక్టోబరు 20 (న్యూస్‌టుడే): రాష్ట్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయాలన్నీ దేవాదాయశాఖ పరిధిలోకి వస్తాయని హైకోర్టు ఈనెల 15వ తేదీన తీర్పునిచ్చింది. గతంలో షిరిడీ ఆలయాలన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తెస్తూ రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా ప్రభుత్వ ఉత్తర్వు చెల్లదంటూ సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. ఈ తీర్పుపై దేవాదాయశాఖ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అడ్మిషన్ దశలోనే త్రోసిపుచ్చింది. అయితే తిరిగి హైకోర్టు ఫుల్‌బెంచ్ కేసును విచారించి రాష్ట్రంలో సుమారు రూ.20 లక్షలు పైగా హుండీ ఆదాయం వస్తున్న 150 పైగా షిర్డీ ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకురావడం సబబేనంటూ తీర్పునిచ్చింది.

అర్చకుల పదవీవిరమణ వయస్సు 58

రాష్ట్రంలో దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న ఆలయాల్లో పనిచేసే అర్చకుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలు గానే అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

శైవాగమపాఠశాల

కృష్ణాజిల్లా తాడిగడప, కె.సి.పి. కాలనీలోని శ్రీ షిరిడిసాయిబాబా మందిరమునందు అర్చకస్వామిగా నున్న శ్రీతోలేటి బాల భాస్కరశర్మ అధ్యక్షతన ఆదిశైవ యూత్‌సొసైటీ తరపున శైవాగమ పాఠశాల ఏర్పాటు చేయుటకు కె.సి.పి దేవస్థానం కమిటీవారు ఆమోదించినారు. శైవాగమకోర్సు 2 సం॥రములు. నిత్యార్చన, వివాహ, గృహప్రవేశ, సత్యనారాయణ వ్రతములు మొదలగు శుభకార్యములు జరుపుట మొదలగువానిలో శిక్షణ యిచ్చుటకు ఏకగ్రీవంగా తీర్మానించి యున్నారు. కావున విద్యార్థులు సంబంధిత వివరాలతో పై కమిటీవారిని సంప్రదించవలెను.

తోలేటి బాలభాస్కరశర్మ
ఆదిశైవ యూత్‌సొసైటీ అధ్యక్షులు
H No: 24 : సాయిబాబామందిరం - కెసిపి కాలనీ,
కానూరు - విజయవాడ - 7

లక్షకుంకుమార్చన

. తూర్పుగోదావరిజిల్లా కాకినాడ పట్టణ ఆర్‌టిసి.బస్‌స్టాండ్ ఎదురుగానున్న "శ్రీ కనకదుర్గ అమ్మవారి 23వ వార్షికోత్సవము సందర్భముగా 28-9-01 ఏకాదశీ శుక్రవారం అమ్మవారికి శ్రీ రుద్రాభిషేకం, సామూహిక లక్షకుంకుమార్చన, అమ్మవారికి విశేష అలంకారములతో అర్చకస్వామి శివశ్రీకాళ్లకూరి సత్యనారాయణ శర్మగారి ఆధ్వర్యంలో, శ్రీ భైరవభొట్ల సత్యనారాయణ దీక్షితులుగారి బ్రహ్మత్వమున (కార్యదర్శి) శ్రీ పుల్లేటికుర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ పూజ్యం హరి నాగేంద్రశర్మ, శ్రీ కాళ్లకూరి దుర్గాప్రసాదుశర్మ, శ్రీ వెలవలపల్లి సత్యనారాయణశర్మ, శ్రీ కొమాళ్లపల్లి సుబ్బారావు, శ్రీచంద్రమౌళి ప్రసాదశర్మ, శ్రీ విలపర్తి శ్రీనివాసశర్మ ప్రభృతఋత్విజులతో, కాకినాడ వేదపండితులతో వందలాది భక్తులుపాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. యీ సందర్భంగా శ్రీ కంఠగురుపీఠమునకు రు 40లు శైవవాణికి రు 40లు సమర్పించారు.



అమలాపురం తాలూకా పల్లంకుర్రు వాస్తవ్యులు లేటు చంద్రమౌళి వెంకటేశ్వర్లు గారి ద్వితీయకుమారుడు సి.వి. నరసింహారావు గారి జ్యేష్టకుమారుడు చిరంజీవి చంద్రమౌళి గణేష్‌కుమార్ ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గల జగదల్‌పూర్ దూరదర్శన్ కేంద్రంలో జూనియర్ ఇంజనీరుగా పనిచేయుచూ 2000 సంవత్సరంలో A.M.I.E. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిగ్రీ ప్యాసు అయిన శుభసందర్భంలో డాక్టరు సి. సూర్యశ్రీనివాస్ R.M.P. రాజమండ్రి వారి ద్వారా శ్రీకంఠ గురుపీఠమునకు 50 రూపాయలు మరియు శైవవాణికి 50 రూపాయలు సమర్పించుచున్నారు. ఇట్లు

డా. చంద్రమౌళి సూర్యశ్రీనివాస్ RMP రాజమండ్రి.

బారసాల

కృష్ణాజిల్లా నందిగామ మం॥ కేతవీరునిపాడు వాస్తవ్యులు నందిగామ ప్రసాదరావు, సీతారావమ్మగార్ల జ్యేష్ఠపుత్రుడు చి॥ వీరభద్రశర్మ, విజయలక్ష్మి దంపతుల ప్రధమ పుత్రికకు 23-9-2001న తాతగారైన సూరేపల్లి లక్ష్మీనరసింహారావుగారి గృహమందు బారసాల జరిపి చిరంజీవికి "సుష్మ" అని నామకరణముచేసిన సందర్భమున శ్రీకంఠగురుపీఠమునకు 25రూ, శైవవాణికి రు 25లున్నూ సమర్పించారు.

కార్తీక వన సమారాధన

ది 25-11-2001 ఆదివారం హైదరాబాదు నగర ఆదిశైవ సంఘమువారి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన స్థానిక కూకట్‌పల్లి దగ్గర ఆల్విన్ కాలనీ సమీపంలో Flot No: 170 తులసీనగర్‌నందు జరుగును. నగరసంఘీయులు అందరు పాల్గొన గోరుచున్నాము.

యస్. నాగేశ్వరరావు

సంస్మరణం

రుద్రపాక భార్గవగీత



చిన్నమ్మా! మేమెంతగానో ప్రేమించే నీవుదూరమైనా నీ మధురస్మృతులు ఎన్నటికీ కరిగిపోవు. మా మనసుల్లో కలకాలం జీవించేఉంటావు. ఈ సందర్భమున వీరు శైవవాణికి విరాళం రు 75లు సమర్పించారు.

ఇట్లు

తాతయ్య కుందుర్తి రాజవరప్రసాదు,

అమ్మమ్మ సీతారామమ్మ

మామయ్య : పున్నేశ్వరశర్మ, అమ్మ : రుద్రపాక సుజాతకుమారి,

తమ్ముడు హర్షచైతన్య.

Bci

వధువుకావలెను

1. వరుడు : వయస్సు 30 సం॥ చిత్తనక్షత్రం - భారద్వాజసగోత్రం వృత్తి : అర్చక- శివాలయం - సింహాచలం దేవస్థానం

2. వరుడు : వయస్సు 28 సం॥ భరణి నక్షత్రం భారద్వాజసగోత్రం వధువు వయస్సు 25లేక 26 సం॥లోపు ఉండాలి. సంప్రదించవలసిన చిరునామా : వెలవలపల్లి అప్పారావు రిటైర్డ్ శైవాగమ పండిట్ - కొత్తవీధి - సింహాచలం- PO విశాఖపట్నం - 530 028. వీరు శైవవాణికి విరాళం. రు 58లు శ్రీకంఠగురుపీఠమునకు రు 10లు.

వధువుకావలెను

వరునిపేరు : దొంతికుర్తి సూర్యనారాయణమూర్తి S/o శేషయ్య
విద్య : 10వ తరగతి. వృత్తి : అర్చకత్వం
గోత్రము : పరాశర, వయస్సు 29 సం॥ నక్షత్రం: ఆశ్లేష
చిరునామా : ధర్మవరం P.O ప్రతిపాదుమండలం. తూర్పుగోదావరిజిల్లా 533432
ఆసక్తిగలవారు పై చిరునామావారిని సంప్రదించవలెను. యీ సం॥ వీరు శైవవాణికి విరాళమురు 50లు.

కార్యకర్తలకు మనవి

రాష్ట్ర ఆగమ అర్చకమహాసభల నిర్వహణకుగాను 2000 సం॥రంలో విరాళములు సేకరించుటకు ప్రత్యేక రశీదు పుస్తకములు ఆదిశైవసంఘ కార్యకర్తలకు ఇవ్వబడినవి. యీ రశీదు పుస్తకాలు గాని, వసూలు పరచిన సొమ్ముగాని మహాసభనాడు యివ్వలేదని గమనించబడింది - యీ విరాళములన్నీ జిల్లా వారీగా పేర్లు చిరునామాలతో ప్రకటించుటకు నిర్ణయించబడినది.

గావున సదరు కార్యకర్తలు వెంటనే తమవద్దనున్న రశీదుపుస్తకములు - వసూలు పరచిన సొమ్ము శైవవాణికార్యాలయము పున్నమ్మతోట - విజయవాడ - శ్రీబోధానంద ఋష్యాశ్రమమనకు పంపవలసినదిగా మనవి చేస్తున్నాము. అట్లు పంపని యడల విరాళాలు ప్రకటనలో రానిచో యిచ్చినవారు బాధపడుదురు - గాన వెంటనే రశీదు పుస్తకాలు- పైకము పంపించగోరుచున్నాము.

పావులూరి సదాశివరావు

20-10-2001

కార్యదర్శి , శ్రీ ఆం॥రాష్ట్ర ఆదిశైవ సంఘము

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
దేవాదాయ ధర్మాదాయశాఖ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

29-12-2001 మరియు 30-12-2001 న జరుపబడు అర్చక ఆగమపరీక్షలు తిరిగి పరిపాలనా సంబంధమైన కారణముల వలన మే నెల 2002 సం.లో జరుపబడును.

అభ్యర్థులు తమ దరఖాస్తులను పంపుకొనుటకు గడువు 31-12-2001 గా నిర్ణయించడమైనది. ఇంతకుముందు దరఖాస్తులు పెట్టుకున్న అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేయనవసరం లేదు.

పరీక్షలు నిర్వహించబడు తేదీలు తదుపరి తెలుపబడును.

సం/- ఎస్. అరుణకుమారి

DIPR No. 1185/CL/Advt 1 / C2/2001-2002

అదనపు కమిషనరు (ఎ.డబ్ల్యూ)

Nov -2001 Dt 2,3 SAIVAVANI RNo 15792/68 AP/V.

శైవానుష్ఠాన ప్రకాశిక మరియు ఆదిశైవ గోత్రప్రవర నిర్ణయము ద్రవ్యదాతలు

శైవానుష్ఠాన ప్రకాశిక తృతీయముద్రణ గోత్రప్రవర నిర్ణయంతో ముద్రించబడి 14-10-2001న ఆగమ సదస్సునందు ఆవిష్కరించబడినది. యీ గ్రంథముద్రణకు తూర్పుగోదావరి జిల్లా కడలి ప్రస్తుతం హైదారాబాదు వాస్తవ్యులు శైవాగమ పండితులు శ్రీ ఉండి విశ్వనాధ శాస్త్రిగారి కుమారుడు, శ్రీ ఉండి సత్యపురుషోత్తమ కుమార్ శర్మ - వారి సోదరులు శ్రీ బోధానంద ఋష్యాశ్రమం అభివృద్ధిని కాంక్షించి పదివేలరూపాయలున్నూ, తూర్పుగోదావరిజిల్లా కాకినాడ డివిజన్ ఆదిశైవసంఘమువారు రు 2500లు మరియు కాకినాడవాస్తవ్యులు శ్రీ అయలూరి కామేశ్వరగురుకుల్ గారి మనుమడు. సూర్యనారాయణశాస్త్రిగారి కుమారుడు శ్రీ అయలూరి దక్షిణామూర్తిశాస్త్రిగారు తమ తండ్రిగారి జ్ఞాపకార్థం రు 2500 కాకినాడ వాస్తవ్యులు శ్రీ భైరవభొట్ల సత్యనారాయణదీక్షితులుగారు రు 500, శ్రీకాళ్లకూరి శ్రీరామసత్యనారాయణగారు రు 500లున్నూ భక్తిబావంతో సమర్పించారు. యీ గ్రంథముద్రణ దాతలకు శ్రీశ్రీకంతశివాచార్య, శ్రీబోధానంద మహర్షిగురువర్యుల కృపాకటాక్షములు, శ్రీ పార్వతీపరమేశ్వరానుగ్రహము గలుగుగాక! యని ఆశీర్వదిస్తున్నాము.

పూజ్యం వీరభద్రశర్మ
ఆశ్రమకార్యనిర్వాహకులు

ఆగమగ్రంధాలు

1.	శైవానుష్ఠాన ప్రకాశిక - గోత్రప్రవరలు	40-00
2.	కారణాగమం శివ ప్రతిష్ఠావిధిః - ప్రధమముద్రణ	60-00
3.	ఆగమకశివార్చనావిధి	30-00
4.	దేవీపూజావిధి	25-00
5.	ఆగమధర్మాలు గల శైవాగమకుసుమావళి	

శైవాగమ ప్రవేశ రు 25 - వర రూ 50 - ప్రవర రూ 50 ప్రశ్నోత్తరములు వలయువారు యీ దిగువ చిరునామాకు వ్రాయవలెను. పోస్టల్‌ఛార్జీలు అదనము. ఫోన్: 0866 482711

ఇట్లు
గూడూరు నాగేశ్వరశర్మ
ఆశ్రమధర్మకర్త

పూజ్యం వీరభద్రశర్మ -
శ్రీబోధానందఋష్యాశ్రమం
పున్నమ్మతోట - విజయవాడ - 520010

Edited Printed and Published by K.Subba Rao on be-half of Andhra Rashtreeya Adi Saiva Sangham, Vija-4 Printed at Chaitanya Offset Printers for Yugandhar Offset Printers, Gandhinagar, Vijayawada -3

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA134M149
పుస్తకం పేరు	శైవవాణి
తారీఖు	31/10/24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	20
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Triveni
పేజీలు విడదీసినది	Triveni
స్కాన్ చేసినది	Sirisha
పరీక్ష చేసినది	RUKSANA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good